సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 1 । మే । 2024



కొండపోడుకూ రైతు భరోసా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశ పెట్టిన రైతు భరోసా పథకం గిరిజన రైతులకు ఎంతో ఉపయోగపడింది.

- 8లో



ఎన్నికల నిర్వహణ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.

- 8లో

భామినిలో వర్షం

భామిని: మండలంలో భానుడి భగభగలు మంగళవారం తీవ్ర మయ్యాయి. ఉదయం నుంచే ఉక్కపోతతో అల్లాడుతున్న జనంపై పగ పట్టినట్లు మండుటెడలో మంగళవారం వానజల్లులు కురిసి మరింత కష్టం పెంచాయి. వేడి మీదున్న పెనంపై నీళ్లు చిలకరించినట్లు ఎండతీవ్రతతో ఉన్న సమయంలో చినుకులు పడడం ప్రజలను అల్లాడించింది. కురిసిన చినుకులకు వేడెక్కిన ఇంటిలో ఉండలేక, ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్యారోగ్యశాఖ జోనల్ మేనేజర్ శాంతిప్రభ



బందలుప్పి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్యారోగ్యశాఖ జోనల్ మేనేజర్ శాంతిప్రభ

పార్వతీపురంటౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జోనల్ మేనేజర్ శాంతిప్రభ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె పార్వతీపురం మండలంలోని బందలుప్పి పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రికార్డులను, మందుల నిల్వలను, ల్యాబ్, వార్డులు, పరిశీలించారు. అనంతరం అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, వయోవృద్ధుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారికి కావలసిన రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వాలని చెప్పారు. వైద్యసేవలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డా.తిరుమల ప్రసాద్, ఈఓ తిరుపతి, శ్రీరాములు, సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

రవికి మృదంగంలో టాప్ గ్రేడ్



ఆకాశవాణి డైరెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రవి

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన మృదంగ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవి ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం నుంచి మృదంగ విభాగంలో ఉన్నతశ్రేణి (టాప్ గ్రేడ్) విద్వాంసునిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి వచ్చిన ధ్రువీకరణ పత్రాలను ఆకాశవాణి కేంద్ర సంచాలకుడు పి.వి.రామ్‌గోపాల్ విశాఖ కార్యాలయంలో రవికి మంగళవారం అందజేసి అభినందించారు. సంగీత వైభవానికి విశేష కృషిచేస్తున్నందుకు, అనేక మంది కళాకారులను ప్రపంచానికి పరిచయం చేస్తున్న రవికి చక్కని గుర్తింపు లభించిందన్నారు. ఆయనకు పలు సంస్థల ప్రతినిధులు, కళాభిమానులు అభినందనలు తెలిపారు.



బాబూ..నీకిది తగునా!

కడుపులో చల్ల కదలకుండా ఇంటి దగ్గరే అందుతున్న పింఛన్ లబ్ధిని అడ్డుకుని..అవస్థలు పాలు చేయడం తగునా? అత్తమీద కోపం దుత్త మీద చూపినట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న అక్కసు మామీద చూపించడం సమంజసమా? ఉరుమురిమి మంగళం మీద పడినట్లు మేమేమి చేశాము పాపం..మా పింఛన్లు మాకు అందనీయకుండా ఎందుకు మోకాలడ్డుతున్నారంటూ ప్రతిపక్ష టీడీపీ నేత చంద్రబాబు, మాజీ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పై పింఛన్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీ గత పాలనలో మేము పడిన అవస్థలు మళ్లీ మాకు గుర్తు చేస్తావా? అంటూ మండిపడుతున్నారు.

- పండుటాకులపై ఎందుకంత పగ?
- వాపోతున్న పింఛన్ లబ్ధిదారులు
- వృద్ధులకు తప్పని అవస్థలు
- ప్రతిపక్షంపై సర్వత్రా వ్యక్తమవుతున్న ఆగ్రహం

పార్వతీపురంటౌన్:

ప్రతినెలా ఒకటో తేదీన తెలతెలవారక ముందే గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల తలుపు తట్టించి పింఛన్లు అందిస్తూ పింఛన్ లబ్ధిదారుల కళ్లల్లో ఆనందాన్ని విరబూయిస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష టీడీపీ.. ఎన్నికల నిబంధనావళిని అడ్డం పెట్టుకుని ఆ అభాగ్యులపై అక్కసు తీర్చుకుంటోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ఏళ్ల తరబడి కీలక భూమిక పోషిస్తున్న వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము అందించనీయకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఫలితంగా మళ్లీ గత ప్రభుత్వంలో చవిచూసిన కష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితిలోకి లబ్ధిదారులను నెట్టేసింది. వలంటీర్లతో పింఛన్లు ఇంటి వద్ద అందించనివ్వకుండా టీడీపీ అడ్డం పడడంతో..వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులు సచివాలయాలకు పరుగులు తీసి, పడిగాపులు పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. తమను ఇటువంటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పై అభాగ్యులు మండి పడుతున్నారు. వారి తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు.



ఏప్రిల్ నెలలో పింఛన్ కోసం వీరఘట్టం మండల కేంద్రంలోని ఆర్‌సీఎం స్కూల్ దగ్గర ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ముఖ్యమంత్రి జగన్‌పై అక్కసుతోనే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర సామాజిక పింఛన్ లబ్ధిదారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ మొత్తాన్ని దశలవారీగా రూ. 3వేలకు పెంచారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దనే పింఛన్ సొమ్ము అందించే ఏర్పాటు చేశారు. గతంలో రోజుల తరబడి క్యూలో నిలబడి పెన్షన్ తెచ్చుకునే దుస్థితి తప్పడం, ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ అందిస్తుండడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారనే అక్కసుతో చంద్రబాబు తన కుట్రలకు పదునుపెట్టారు. సిటిజన్ ఫోరమ్ ఫర్ డెమొక్రసీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయించి మరీ పెన్షన్ పంపిణీపై కుట్రలు చేశారు. ప్రజలకు కలుగుతున్న మేలును అడ్డుకునేలా సాగించిన నీచ రాజకీయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఈ నెల లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఈ నెల పింఛన్లను బుధవారం నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. 1,12,947 మందికి రూ. 33.38 కోట్లు జమ చేయనున్నారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందించనున్నారు. ఇళ్ల వద్దకే వెళ్లి కేవలం 32,124 మంది ఇళ్ల వద్దకే వెళ్లి రూ.8.86 కోట్లు మాత్రమే అందజేయనున్నారు.

ప్రతినెలా 1,45,071 లబ్ధిదారులకు పంపిణీ



ఎస్‌ఎన్‌పీ కాలనీలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అశోక్ (ఫైల్)



పార్వతీపురంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాలో 1,45,071 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక పింఛన్ల రూపంలో రూ. 42.34 కోట్లు అందిస్తోంది. చంద్రబాబు అండ్‌కో అవమానకరంగా అనేక మాటలు అంటున్నప్పటికీ వలంటీర్లు పింఛన్ల పంపిణీని ప్రతి నెలా మొదటి తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి అందజేశారు. అటువంటి వారి సేవలను ఎన్నికల కోడ్ పేరిట దూరం చేయడంపై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం తగదు



వలంటీర్ల ద్వారా ప్రతి నెలా పెన్షన్ సొమ్మును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే పంపేవారు. ఈ డబ్బులు మందులకు, తిన డానికి ఉపయోగపడుతున్నాయి. మా వంటి వృద్ధులు పింఛన్ సొమ్ము తీసుకోవడానికి మండుటెండలో బ్యాంకులకు వెళ్లలేని పరిస్థితి ఉంది.

-జి.బంగారం, లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

జగన్‌తోనే మేలు



గతంలో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వచ్చిన కొద్దిపాటి సొమ్ములో అక్కడి వారికి వాటా ఇవ్వాల్సి వచ్చేది. కానీ సీఎం జగన్ వచ్చాక ఆపరిస్థితి మారింది. ఇంటికే వచ్చి వలంటీర్ పెన్షన్ ఇస్తున్నారు. ఎంతో మంది వృద్ధులు, వికలాంగులకు మేలు జరుగుతుంటే చూడలేక ఇటువంటి కుట్రలు పన్నుతున్నారు. జగన్‌తోనే మాకు మేలు జరుగుతుంది.

-ఉర్లాపు తవుడమ్మ, పింఛన్ లబ్ధిదారు, శివుని గ్రామం, కొమరాడ మండలం

ఏం పాపం చేశామని



సీఎం జగన్ పెన్షన్ల నుంచి పథకాల వరకూ మాకు శ్రమ లేకుండా వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచుతూ అండగా నిలిచారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై బురద జల్లడం సమంజసం కాదు. ఏం పాపం చేశామని ఈ వయస్సులో మాకీ శిక్ష? మేం సంతోషంగా ఉండడం చంద్రబాబుకు ఇష్టం లేదా? మాలాంటి వారి ఉసురు తప్పక తగులుతుంది.

-వి. లక్ష్మి, లబ్ధిదారు, బుక్కురు గ్రామం, పాలకొండ మండలం

లెక్క పక్కాగా ఉండాలి



పార్వతీపురం: సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్

పార్వతీపురం: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వారి ఖర్చు లెక్కలు పక్కాగా నిర్వహించాలని పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్ అన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వ్యయ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, వ్యయ రిజిస్టర్లు అందించామని, వాటిలో రోజువారీ జరిగే ప్రతి ఖర్చును పొందుపర్చాలని కోరారు. వ్యయ రిజిస్టర్లకు అనుబంధంగా ఎన్నికల వ్యయ విభాగం ప్రతి అభ్యర్థి ఖర్చును పరిశీలించి షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తుందని చెప్పారు. ఈ రెండు రిజిస్టర్లలో అంశాలు ఒకేలా ఉండాలని పేర్కొన్నారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ కూడా ఖర్చులో జమ అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, సమన్వయ అధికారి కె రాబర్ట్ పాల్, వ్యయ విభాగం నోడల్ అధికారి పి శ్రీరామమూర్తి, ఆర్.రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో...



సాలూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయపరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

సాలూరు: ఎన్నికల ఖర్చుల లెక్కలు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల వ్యయపరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏఈఓ, వీటీటీ, ఎన్నికల అభ్యర్థులు, ప్రతినిధులు తదితర బృందాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ఖర్చు వివరాలు తదితర అంశాలపై మాట్లాడారు.ఎన్నికల నియమావళికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఆయన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టార్ ఆఫీసర్‌లకు జరుగుతున్న ఈవీఎంలపై ట్రైనింగ్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ తదితరులు ఉన్నారు.

నేడు బొబ్బిలిలో...

జగన్ ప్రచార భేరి

- మలివిడత ఎన్నికల ప్రచారంలో భాగంగా రాక
- బొబ్బిలి మెయిన్‌రోడ్డు సెంటర్‌లో రోడ్డు షో
- ఉదయం 10 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం
- ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ చిన్నశ్రీను, ఎమ్మెల్యే శంబంగి
- సీఎంకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'మేమంతా సిద్ధం' అంటూ గత వారం విజయనగరం జిల్లా చెల్లూరులో నిర్వహించిన బహిరంగసభ అశేష జనవాహినితో దద్దరిల్లిన సంగతి చూశాం. అంతకుమించిన ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మలివిడత ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బొబ్బిలి గడ్డపై అడుగుపెడుతున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'మీ డ్రీమ్స్ నా స్కీమ్స్' అంటూ తన 58 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన చెల్లూరు సభలో వివరించడం ప్రజలను చక్కగా ఆకట్టుకుంది. అవే కార్యక్రమాలను మరింత ప్రయోజనంతో కొనసాగించడానికి ఇటీవల ప్రకటించిన నవరత్నాల ప్లస్ మేనిఫెస్టోపై ప్రజల్లో చర్చ సాగుతోంది. వాటిని వివరించేందుకు బుధవారం జరిగే బొబ్బిలి సభను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేదికగా ఉపయోగించుకోనున్నారని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలకడానికి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బహిరంగ సభాప్రాంతాన్ని పరిశీలిస్తున్న నేతలు మజ్జి శ్రీనివాసరావు, వై.వి.సుబ్బారెడ్డి, తదితరులు


సీఎం పర్యటన ఇలా...

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి విమానంలో 9 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 10 గంటలకల్లా బొబ్బిలి వస్తారు. రాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, కోర్టు జంక్షన్, పోలీస్‌స్టేషన్, వాటర్‌ట్యాంక్ ఏరియా మీదుగా పైల్ బజారు వరకూ రోడ్డు షో నిర్వహించనున్నారు. శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియం మీదుగా లోకబందు ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రదేశానికి చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. తర్వాత మళ్లీ అదే మార్గంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఎన్నికల ప్రచార కార్యక్రమానికి సీఎం జగన్ వెళ్లనున్నారు. హెలిప్యాడ్, రోడ్డు షో ఏర్పాట్లను మంగళవారం వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, పార్టీ నాయకులు పరిశీలించారు.

జనం చెంతకే జననేత...

ఇటీవల హత్యాయత్నానికి దుండగులు తెగించినా జననేత జగన్‌మోహన్‌రెడ్డి వెరవలేదు. తనదైన శైలిలో ఎన్నికల ప్రచారభేరి మోగిస్తూ సాగుతున్నారు. బొబ్బిలిలోనూ జనం చెంతకు రానున్నారు. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రజల మధ్య నుంచే వెళ్లనున్నారు. ఈ దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. ప్రత్యేకంగా రోప్ పార్టీలను ఉపయోగిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను భారీ బందోబస్తుకు కేటాయించారు. జిల్లా ఎస్పీ దీపిక మంగళవారం పర్యవేక్షించారు. సీఎం జగన్ రోడ్డు షో దృష్ట్యా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భారీ వాహనాలను దారిమళ్లించనున్నారు.

చిరుద్యోగులకు వరం



- కరుణ చూపిన ప్రభుత్వం
- పథకాలు పొందేందుకు వేతన పరిమితి రూ.25 వేలకు పెంపు
- విద్య, వైద్యం, ఇళ్లు పొందే అవకాశం
- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ఆయా వర్గాల హర్షాతిరేకం

సాక్షి, పార్వతీపురం మన్యం: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాలు ప్లస్–2024 మేనిఫెస్టోను రూపొందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకున్నారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణానికి సంబంధించి నవరత్న పథకాలన్నీ వారికి వర్తింపజేసేందుకు నిర్ణయించారు. దీనిపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. నెలకు రూ.25 వేలు వేతనం కలిగిన వారికి ఇళ్లు, వైద్యం, విద్య ఉచితంగా అందించేలా మేనిఫెస్టోలో ప్రకటించారు. దీనివల్ల జిల్లాలో సుమారు 8 వేల నుంచి 12 వేలకు మందికి పైగా చిరుద్యోగులకు మేలు కలగనుంది.

నాడు చిన్నచూపు..నేడు గౌరవం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లను గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి గౌరవ వేతనాలను గణనీయంగా పెంచారు. ఆదాయ పరిమితికి మించి వేతనాలు(పట్టణాల్లో రూ.12 వేలు, గ్రామాల్లో రూ.10 వేలు) రావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హత పొందే పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయాన్ని పలుమార్లు ఆయా ఉద్యోగులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రూ.11,500 వేతనం ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పట్టణాల్లో పథకా ల్లో పథకాలు అందుతున్నా..గ్రామాల్లో లబ్ధికి దూరమయ్యేవారు. రూ.12 వేలు వేతనం అందుకున్న ఎంతోమంది పొరుగు సేవల ఉద్యోగులు ప్రభుత్వ పథకాలకు అర్హత పొందలేకపోయేవారు. ఇప్పుడు ఆదాయ పరిమితిని రూ.25 వేలకు పెంచి అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, ఉచితంగా ఇళ్లు ఇచ్చేలా మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి మార్పులు చేశారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో మహిళా శిశు సంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమంలోని ఆశవర్కర్లు, శానిటేషన్, కంటింజెంట్ వర్కర్లు, గిరిజన సంక్షేమంలోని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, పాఠశాల విద్యలోని వంటవారు, సహాయకులు, హోంగార్డులకు లబ్ధి కలగనుంది.

స్వాగతించాల్సిందే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు ప్లస్ పేరిట పెట్టిన మేనిఫెస్టో బాగుంది. అన్ని వర్గాలకూ మేలు చేకూర్చేలా ఉంది. దీన్ని స్వాగతించాల్సిందే. ప్రధానంగా అవుట్ సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు మేలు చేకూర్చేలా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

-ఎం.శివున్నాయుడు, పాలకొండ

బాధ్యతగా విధి నిర్వహణ

- డీఎంహెచ్‌ఓను ప్రశంసించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురంటౌన్: వృత్తిని బాధ్యతగా నిర్వహించి ఉద్యోగానికి వన్నె తీసుకువచ్చారంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావును కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రశంసించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆయనకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జగన్నాథ రావును సత్కరించారు. ఈ సందర్భంగా కలెకర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలో మంచి అధికారులలో జగన్నాథ రావు ఒకరన్నారు. జిల్లాలో అనేక కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. జగన్నాథ రావు అనుభవం, వృత్తి పట్ల అంకిత భావం యువతరం స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మంచి సేవలు అందించాలని సూచించారు.



ఉద్యోగంలో సంతృప్తి

ఉద్యోగ విరమణ చేసిన డీఎంహెచ్‌ఓ జగన్నాథ రావు మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యోగ జీవితం సంతృప్తిని, తీపి గుర్తులను అందించిందన్నారు. ఉద్యోగ ప్రస్థానం మొదటిలో అతిసార కేసులు అధికంగా నమోదయ్యేవని, రాత్రి పగలు సేవలు అందించి ప్రాణాలు కాపాడడం మరపురాని సంఘటనలన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో తన సేవలు గుర్తించి వినియోగించు కోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కుటుంబ సభ్యుల సహకారం, అధికారులు, సిబ్బంది తోడ్పాటు లభించిందని సంతృప్తి వెలిబుచ్చారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకుడు డా.రామ గిడ్డయ్య, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా బి.వాగ్దేవి, మలేరియా జోనల్ అధికారి శాంతిప్రభ, కేజీహెచ్ ఆర్ఎంఓ డా. ధవళ భాస్కర రావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారులు డా.కొయ్యాన అప్పారావు, ప్రకాశ్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ, విశ్రాంత డీఎంహెచ్‌ఓ డా ఎస్.తిరుపతిరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా యాళ్ల వివేక్, రెడ్‌క్రాస్ చైర్మన్ డా.ఎం.శ్రీరాములు, కర్షక మహర్షి ఆస్పత్రి వ్యవస్థాపకుడు డా.డి రామ్మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అప్పలనాయుడు


డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సంబంగి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య విద్య సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ అనిలాసునందని పదవీ విరమణ పొందారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కళ్యాణి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కళ్యాణిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్సు చదువుతున్న రేణుక కళ్యాణి 84 కిలోల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాయిలో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థిని ప్రతిభ చాటింది. మే నెల 18న తమిళనాడులో జరగబోయే అంతర జాతీయ ఇంటర్ విశ్వవిద్యాలయం పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొని సత్తాను కనబరచనుంది. కళ్యాణిని పీడీ బి.శ్రీను, సెక్రటరీ బి.రవి, హెచ్‌ఓడీ డా.బాలభారతి తదితరులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన వసుం నరసమ్మ(36) మనస్తాపంతో సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. నరసమ్మ భర్త సన్యాసిరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సన్యాసిరావు విధులు ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య అన్నం, కూర వండి చారు చేయకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఒకరిపై ఒకరు అలిగి ఎవరు భోజనం చేయలేదు. దీంతో మనస్తాపం చెందిన నరసమ్మ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి కూమార్తె పీత సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

శిక్షణతో ఉపాధి

విజయనగరం అర్బన్: శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉపాధి కల్పనకు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అందించిన విద్యుత్ పరికరాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అసోసియేట్ మేనేజర్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి కేవీరమణ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

తెర్లాం: జాతీయ స్థాయి జూనియర్స్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జాతీయ స్థాయిలో ఏపీ బాలురు, బాలికల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించేందుకు తమ సత్తాను చాటారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూర్‌లో ఈ నెల 27 నుంచి జాతీయ స్థాయి జూనియర్స్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలకల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు రాష్ట్ర జట్లలో ప్రాతినిథ్యం వహించారు. వీరంతా ఫైనల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఏపీ జట్లకు విజయాన్ని అందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఏపీ బాలుర జట్టులో జిల్లాకు చెందిన కె.వేణు, కె.రోహిత్, జి.జశ్వంత్, సీహెచ్ శ్యామ్‌కుమార్, కె.రాఘవ, బాలికల జట్టులో ఎ.తేజ, పి.చైతన్యకుమారి, కె.అఖిల, ఎ.భవనేశ్వరి ప్రాతినిథ్యం వహించారు. జిల్లా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, సీతఊ వెంకటేశ్వరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260


జియ్యమ్మవలస: తురకనాయుడువలసలో ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణి


వీరఘట్టం: కుమ్మరిగుంట గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

భానుడు భగభగమంటున్నా..

- ఓటరు దేవుళ్ల కరుణ కోసం
- జోరుగా ఎన్నికల ప్రచారం
- దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

ప్రచార పర్వం

భానుడు తన ప్రతాపం చూపిస్తూ భగభగమని మండుతున్నా.. ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెరవడం లేదు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు వెంట రాగా పార్వతీపురం మన్యం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లను నేరుగా కలుస్తూ అభివృద్ధి, సంక్షేమ పరిపాలనను కొనసాగించేందుకు తమను మళ్లీ గెలిపించి..ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మక్కువ: ఎండను లెక్కచేయకుండా సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొరతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వృద్ధురాలు


పార్వతీపురంటౌన్: టోంకి గ్రామంలో పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఇంటింటి ప్రచారం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

ఎస్పీ విక్రాంత్ పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, 174సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, తదితర కేసులపై ఈ సమావేశంలో సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులను ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్సను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కేసుల ఛేదింపులో పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెలకువలను అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎన్నికలకు బందోబస్తుకు కేంద్ర బలగాలు

సార్వత్రిక ఎన్నికల బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన కేంద్ర పోలీస్ దళం ఆర్‌పీఎఫ్ ఫోర్స్‌తో జిల్లాలో గల పోలీస్‌స్టేషన్ల అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి వారి పరిధిలో గల సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ గ్రామాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు పోలీసు డిపార్ట్‌మెంట్ తీసుకుంటుందని, ఆర్‌పీఎఫ్ ఫోర్స్ భరోసా ఉంటుందని, ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్, తదితర విధులు ఎన్నికలు పూర్తయినంతవరకు నిర్వహించాలని తెలియజేశారు. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యాత్మక గ్రామాలు అతి సమస్యాత్మక గ్రామాలను విరివిగా సందర్శించి నిఘా పెడుతూ ముందస్తు సమాచారం సేకరించాలని ఆదేశించారు.

సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీ

ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు అధికారులు చెక్ పోస్టులను సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేస్తూ మద్యం, నగదు అక్రమ తరలింపు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. 24గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్సీ అండ్ ఎస్టీ సెల్ డీఎస్పీ జి.మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు, ట్రైనీ డీఎస్పీ ఎస్ఎండి అజీజ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ బీఎండి ప్రసాదరావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


రెల్లిగూడకు చెందిన వారికి కండువాలు వేస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు


లాభేసు గ్రామానికి చెందిన వారికి కండువాలు వేస్తున్న పరీక్షిత్‌రాజు, పుష్పశ్రీవాణి దంపతులు

- పార్టీలోకి ఆహ్వానించిన పాముల పుష్పశ్రీవాణి, పరీక్షిత్ రాజు

జియ్యమ్మవలస: కొమరాడ మండలంలోని లాభేసు గిరిజన గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు, కురుపాం మండలంలోని ఉదయపురం పంచాయతీ రెల్లిగూడ గ్రామానికి చెందిన 20 కుటుంబాల యువత టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు కురుపాం వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుల సమక్షంలో చినమేరంగిలోని వారి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలకు మెచ్చి తామంతా పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ముచ్చటగా మూడోసారి కురుపాం ఎమ్మెల్యేగా పుష్పశ్రీవాణిని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కొమరాడ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దననాయుడు, పార్టీ మండల నాయకులు, యువత పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన బొడ్డవలస గ్రామానికి చెందిన టీడీపీ కుటుంబాల వారు

పార్వతీపురంలో 50 కుటుంబాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి ఆయన సమక్షంలో పార్టీ కండువాలు వేసుకుని వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వారందరినీ అలజంగి జోగారావు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు మీరంతా కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం కె. సూర్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 9వ తరగతివరకు ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొండపోడుకూ రైతు భరోసా

- ఏజెన్సీలో 48,803 మంది రైతులకు రూ.83 కోట్ల చెల్లింపు
- మేనిఫెస్టోలో రూ.16 వేలకు పెంపుతో గిరిజన రైతుల హర్షం

సీతంపేట:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం గిరిజన రైతులకు ఎంతో ఉపయోగపడింది. పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో సీతంపేట ఐటీడీఏ పరిధిలో అటవీసాగు హక్కు పత్రాలకు సైతం రైతుభరోసా సాయం వర్తింపచేశారు. ఈ నేపథ్యంలో ఐటీడీఏ సబ్‌ప్లాన్ మండలాల్లో గల 25,750 ఎకరాల విస్తీర్ణంలో 17,139 మందికి ఆర్‌వోఎఫ్‌ఆర్ (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పంపిణీ చేశారు. ఇందులో కొండపోడు వ్యవసాయం చేస్తున్న 9,056 మందికి 12,838 ఎకరాల్లోనూ, డీకేటీ (దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు) 8.083 మందికి 12,892 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అటవీప్రాంతంలో సాగు చేసే గిరిజన రైతులకు సాగుహక్కు పత్రాలు ఇచ్చి వారికి అన్ని రకాల హక్కులు కల్పించడానికి చర్యలు తీసుకున్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ కలిగిన ప్రతి ఒక్కరికి రైతు భరోసా అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కళావతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి వెంటనే ప్రభుత్వం స్పందించి గిరిజన రైతులకు రైతు భరోసా సదుపాయం కల్పించింది. ఈ మేరకు సీతంపేట ఏజెన్సీలో 48,808 మంది రైతులకు గత ఐదేళ్లలో రూ.83.192 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఏటా ఒక్కొక్కరికి రూ.13,500లు చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. వైఎస్సార్‌సీపీ తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోలో రైతు భరోసా సాయం రూ.16 వేలకు పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ఐదేళ్లలో సీతంపేట ఏజెన్సీలో చెల్లింపు ఇలా...

సంవత్సరం	రైతులు	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	8,840	11.93
2020–21	11,949	16.13
2021–22	14,466	19.53
2022–23	13,209	17.602
2023–24	13,344	18.00


కొండపోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులు (ఇన్‌సెట్లో) రైతు భరోసా పడుతోందని ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా చూపిస్తున్న గిరిజన మహిళ

గిరిజన రైతులకు ఎంతో మేలు చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ఎంతో మేలు చేశారు. ఐదేళ్లలో రైతు భరోసాతో లబ్ధి కలిగింది. ఇప్పుడు రైతు భరోసా పథకం సాయం రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది.

–ఎస్.మంగయ్య, ఎంపీటీసీ, చిన్నబగ్గ

జగన్‌బాబుకు రుణపడి ఉంటాం



మూడు ఎకరాల్లో కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్నాను. అటవీపట్టాలకు సైతం రైతు భరోసా వర్తింపచేయడంతో ఏటా నా బ్యాంకు ఖాతాల్లో రూ.13,500లు డబ్బులు పడుతున్నాయి. ఆ మొత్తంతో వివిధ రకాలైన పంటల పెట్టుబడికి అవకాశం ఏర్పడింది. ఇలా రైతులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది.

–సవర తిక్కమ్మ, రాజన్నగూడ